సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ¦ 28 ¦ నవంబర్ ¦ 2023



మీ బిడ్డను గెలిపించండి

'మహేశ్వరం నా ఇల్లు'.. మీ ఇంటి ఆడబిడ్డనైన నన్ను ఆశీర్వదించి గెలిపించండి అని బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి కోరారు. 6లో▸



అభ్యున్నతికే ఆరు స్కీంలు

పేదల అభ్యున్నతికే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను తీసుకువచ్చిందని కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. 6లో▸



సీపీఎంను గెలిపించండి

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థులను అసెంబ్లీకి పంపించాలని, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ కోరారు. 6లో▸





షాద్‌నగర్, చేవెళ్లలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలకు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

కారు.. హుషారు

షాద్‌నగర్, చేవెళ్లలో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలు

- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు
- గులాబీమయమైన సభా ప్రాంగణాలు
- హోరెత్తించిన పాటలు.. కార్యకర్తల స్టెప్పులు
- తన ప్రసంగాలతో జోష్ నింపిన సీఎం కేసీఆర్

షాద్‌నగర్/షాద్‌నగర్‌రూరల్/చేవెళ్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్‌నగర్, చేవెళ్లలో సోమవారం చేపట్టిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలు విజయవంతమయ్యాయి. రెండు నియోజకవర్గాల్లోని ఆయా మండలాల నుంచి భారీగా జన సమీకరణ చేపట్టారు.ఇటు షాద్‌నగర్ పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న యాగశాల..అటు చేవెళ్లలోని ఫరా కళాశాల మైదానం జనంతో నిండిపోయాయి. సభాప్రాంగణాలు గులాబీమయం అయ్యాయి. జై కేసీఆర్ నినాదాలు మిన్నంటాయి. షాద్‌నగర్‌లో పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, చేవెళ్లలో పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తరపున సీఎం కేసీఆర్ ప్రచారం నిర్వహించారు.

ఆకట్టుకున్న ఆటాపాట

- షాద్‌నగర్‌లో 'గులాబీల జెండలే రామక్క.. గుర్తుల గుర్తుంచుకో రామక్క.. కారును గుర్తుంచుకో రామక్క' అని పాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలోని తాండ్ర గ్రామానికి చెందిన గాయకులు కొమ్ము లక్ష్మమ్మ, బొల్లె సుశీల, శాంతమ్మ, కలమ్మ, అనసూయ ఆకట్టుకున్నారు.
- చేవెళ్లలో ధూంధాం పాటలు అలరించాయి. గులాబీల జెండలే పాట మధుప్రియ పాడుతుంటే ఎమ్మెల్యే కాలె యాదయ్య నృత్యం చేస్తూ సభకు వచ్చినవారిని ఉత్తేజపరిచారు.

అంజయ్య యాదవ్ వజ్రపు తునక

షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వజ్రపు తునకలాంటి మనిషి, ఎవరికీ హానీ తలపెట్టని వ్యక్తి.. ఇలాంటివారు చాలా తక్కువగా ఉంటారు.. నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తున్నాడని సీఎం కేసీఆర్ సభలో కొనియాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి తన వెంట నమ్మిన బంటులా ఉన్నాడని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు మరింత ముందుకు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో అంజయ్య యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాలె యాదయ్య సాయం చేసే మనసున్నోడు

చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య చీమకు, దోమకు కూడా నష్టం చేసే వ్యక్తి కాదు. అవసరమైతే సహాయం చేస్తాడే కాని నష్టం మాత్రం ఎవరికీ చేయడని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికోసం నిరంతరం తపిస్తాడు. అందరికీ నేను ఆర్డర్ చేస్తే.. యాదయ్య నన్ను ఆర్డర్ చేస్తాడు. నా దగ్గరకు రాగానే ఎమ్మెల్యే సాబ్ ఏం ఆర్డర్ అని అడుగుతాను. ఆయన వచ్చిండంటే నియోజకవర్గానికి ఏదో ఒకటి చేయాలని పట్టుబట్టి తీసుకెళ్తాడు అని గుర్తు చేశారు. నాకు దగ్గరోడు కాబట్టి ఆయన అడిగిన తరువాత కాదనే ముచ్చట ఉండదు.

పటిష్ట బందోబస్తు

ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణాన్ని ప్రత్యేక పోలీసులు జాగిలాలతో తనిఖీ చేశారు.

షాద్‌నగర్‌కు వరాలు

త్వరలో మెట్రో రైలు ప్రాజెక్టును షాద్‌నగర్ వరకు విస్తరింపజేస్తామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. దీంతో ఇక్కడి భూముల ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు. త్వరలో లక్ష్మీదేవునిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. రిజర్వాయర్ నిర్మాణంలో ఎక్కువ భూములు మునిగిపోకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. షాద్‌నగర్‌కు మెడికల్, పీజీ కళాశాలలను మంజూరు చేసే బాధ్యత తనదని సీఎం హామీ ఇచ్చారు. కళాశాలలు ఏర్పాటైతే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు తెచ్చాయి. ఏ ప్రభుత్వాలు కూడా ప్రజల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. అరవై ఏళ్ల పాలనలో ఆగమైన బతుకుల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుంది. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దు. కారుగుర్తుకు ఓటువేసే బాధ్యత మీది.. అభివృద్ధి చేసే బాధ్యత మాది.

ఎక్కడా లేని అభివృద్ధి



దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి భావితరాలకు తెలిసేలా చేసిన నాయకుడు, రైతు బాంధవుడు సీఎం కేసీఆర్. ఏ ప్రభుత్వాలు చేయని విధంగా నియోజకవర్గానికి భారీ పరిశ్రమలు వచ్చేలా చేశారు. ఆయా పరిశ్రమల్లో వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాంత అభివృద్ధికి అడ్డుగా ఉన్న జీఓ 111ను తొలగించినందుకు సంతోషంగా ఉంది.

చేవెళ్లకు వరాలు

చేవెళ్ల నియోజకవర్గంలోని దళితులందరికీ ఒకే విడత దళితబంధు కావాలని ఎమ్మెల్యే యాదయ్య అడిగాడు అందుకే అందరికీ ఒకే విడతలో దళితబంధు ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో అభివృద్ధికి అడ్డుగా ఉన్న జీఓ 111ను తొలగించాం. చిన్నచిన్న అడ్డంకులు ఉన్నాయి.. మాస్టర్‌ప్లాన్ తయారు చేసి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే పూర్తిగా తొలగించే బాధ్యత తనదన్నారు. త్వరలోనే చేవెళ్లలో మరిన్ని పరిశ్రమలు తీసుకువస్తామన్నారు. తొందరలోనే పాలమూరు-రంగారెడ్డి నీళ్లు చేవెళ్ల వరకు వస్తాయన్నారు.

న్యూస్‌రీల్

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

పార్టీ ఏపీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు



ప్రచారంలో గిడుగు రుద్రరాజు, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరులు

మీర్‌పేట: చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఓటర్లను కోరారు. కార్పొరేషన్ పరిధిలోని 28, 37 డివిజన్లలో సోమవారం పార్టీ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి పద్మశ్రీ, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మహేశ్వరం అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సతీమణి విజయలక్ష్మితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలను ప్రజలకు వివరిస్తూ ఓటును అభ్యర్థించారు. అనంతరం గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని, ప్రజలంతా తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో స్థానిక నాయకులు ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, ఎడ్ల మల్లేష్, అక్కి మాధవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయశాంతి

కచరా పాలనకు చరమగీతం పాడండి

- అవినీతిలో కూరుకుపోయిన కేసీఆర్ కుటుంబం
- కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి

ఇబ్రహీంపట్నం: ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కచరా పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సినీ నటి, కాంగ్రెస్ నేత విజయశాంతి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె మల్‌రెడ్డికి మద్దతుగా ఇబ్రహీంపట్నంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. పేదలు బీఆర్‌ఎస్ ఉచిత హామీలకు మోసపోవద్దన్నారు. వారి కుటుంబమంతా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పెట్టిన పథకాలను సీఎం కేసీఆర్ నీరుగార్చారన్నారు. తాను తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విషయాన్ని గుర్తుకు చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని చేపట్టగానే ఉద్యమకారులను దూరంగా పెట్టారన్నారు. పేదలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యారన్నారు. సీఎం కుటుంబంపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తోందన్నారు. తాను బీజేపీలో ఉండగా నిత్యావసర సరకులు, వంట గ్యాస్ సిలిండర్ ధరలు పెంచొద్దని, పేదలు ఇబ్బందులు పడతారని ఎంత మొత్తుకున్నా మోదీ పట్టించుకోలేదని ఆరోపించారు. మల్‌రెడ్డి రంగారెడ్డికి ఓట్లు వేసి గెలిపిస్తామని అమ్మవారిపై ప్రజల చేత ప్రమాణం చేయించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేసి పేదలను ఆదుకుంటానని అమ్మవారి సాక్షిగా మల్‌రెడ్డి రంగారెడ్డితోనూ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి పాల్గొన్నారు.

ఆ మూడు పార్టీలు ఒక్కటే

- అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ

ఇబ్రహీంపట్నం: కేసీఆర్, ఒవైసీ, కాంగ్రెస్ ఒక్కటేనని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ అన్నారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్‌ను గెలిపించాలని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మిటింగ్‌లో పిలుపునిచ్చారు. ఫాంహౌస్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పరిపాలన చేతకాక రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని విమర్శించారు. కమీషన్లు, పర్సంటేజీలపైనే దృష్టి పెట్టి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చాడన్నారు. ఇక్కడ బీజేపీ సర్కార్ ఏర్పాటయ్యాక ఒవైసీ బ్రదర్స్ దాదాగిరి నడవదని, పూర్తిస్థాయిలో వారి ఆగడాలను అడ్డుకుంటామన్నారు. కేసీఆర్, ఒవైసీ ప్రాణ మిత్రులని వారిద్దరూ కలిసి రాష్ట్రాన్ని దోచుకునేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. రాహుల్ గాంధీ గ్యారంటీలను వాళ్ల తల్లి కూడా నమ్మదని ఎద్దేవా చేశారు. అబద్ధపు హామీలను ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో అధికారం వస్తే సంక్షేమ రాజ్యం వస్తుందని, రజాకార్ల రాజ్యం అంతం అవుతుందన్నారు. అస్సాంలో కంటే పెట్రో ధరలు ఇక్కడ ఎక్కువగా ఉన్నాయన్నారు. పెట్రోపై వచ్చిన అదనపు సొమ్ము ఎరిరి జేబులోకి పోతోందో అందరికీ తెలుసన్నారు. ఎవరికి ఓటు వేయాలో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నోముల దయానంద్‌గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. అస్సాం సీఎం బిశ్వశర్మ ఎక్కడ అడుగుపెడితే అక్కడ బీజేపీ గెలుస్తుందని, ఇబ్రహీంపట్నంలో పార్టీకి ఇది శుభసూచకమన్నారు. బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల కోసం బీజేపీ పనిచేస్తుందని.. ఓట్లు అడిగే హక్కు తమకే ఉందన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ఎమ్మెల్యే, ఇన్‌చార్జి సందీప్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



అస్సాం సీఎం బిశ్వశర్మకు గజమాల వేస్తున్న కార్యకర్తలు

పక్కాగా పోలింగ్ నిర్వహణ

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డి జిల్లా : ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భారతి హోళికేరి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య అధికారులు సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి సమీకృత కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. సమావేశం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. ఈసీ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్‌లో భాగస్వాములను చేసేలా, ఆ సందేశం స్పష్టంగా తెలిసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సదుపాయాలను సరి చూసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రచారం 28 సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని, అనంతరం 48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ పాటించాల్సి ఉంటుందన్నారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు తిరిగి వెళ్లేలా చూడాలన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వర్తించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూమ్ కు ఈవీఎం యంత్రాల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని, పోలీసు బందోబస్తు మధ్య వాటిని తరలించాలని, సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, మాక్ పోల్ నిర్వహించాలని, పోలింగ్ సజావుగా జరిగేతి విధులు నిర్వర్తించాలని, అవాంఛనీయ ఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని, జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళికేరి

పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల విధుల్లో నియమించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ భారతిహోళికేరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహించిన ఆయా కేంద్రాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లోనూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్‌కు అవకాశం కల్పించామన్నారు. ఈ నెల 29 వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా వీలు కల్పించామని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురించకూడదని అన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం ఆందోళన

షాద్‌నగర్: ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో పలువురు ఉపాధ్యాయులు సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నా జాబితాలో తమ పేర్లు లేకపోవడం దారుణమని అన్నారు. ఈ విషయమై అధికారులను ఎన్ని సార్లు కలిసినా వారు సరైన సమాధానం చెప్పడం లేదని వాపోయారు. తాము పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు చేసిన దరఖాస్తులను అధికారులు తిరస్కరించినట్లు ఆరోపించారు. ఒక్కరోజు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకునే అవకాశం ఉందని, అధికారులు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించకపోతే కోర్టుకు వెళ్తామని తెలిపారు. పోలింగ్ విధులను బహిష్కరిస్తామన్నారు.



ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

పేదల అభ్యున్నతికే ఆరు స్కీంలు

కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్

షాబాద్: పేదల అభ్యున్నతికే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను తీసుకువచ్చిందని అధికారంలోకి వచ్చిన వెంటనే తొలిసంతకం ఆరు స్కీంలపైనే ఉంటుందని కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని గోపిగడ్డ, పోలారం తండా, పోతుగల్ తండా, దేవుని గడ్డ, ఎల్గొండగూడ, చర్లగూడ, ఆస్పల్లిగూడ గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. సీపీఐ శ్రేణులు చురుకైన పాత్ర పోషించి చేవెళ్ల నుంచి తనను అసెంబ్లీకి పంపించాలని కోరారు. ఆరు గ్యారెంటీలతో సబ్బండ వర్గాలకే మేలు చేకూరుతుందన్నారు. ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, ఎస్.రాంరెడ్డి, షాబాద్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అశ్విని, షాబాద్, మద్దూరు సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్,


షాబాద్: ప్రచారంలో మాట్లాడుతున్న భీంభరత్

జయమ్మ, అశోక్, మల్లేష్, బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, నాయకులు జోగు వెంకటయ్య, రవీందర్, నర్సింహులు, రషీద్‌పటేల్, అక్తర్‌పాషా, రవీందర్ నాయక్, రాహుల్‌గుప్తా, యాదయ్య, రవి, చెన్నయ్య, రంగయ్య, శ్రీరాంరెడ్డి, సత్యనారాయణ, బాలయ్య, యాదయ్య, చెన్నయ్య, రాంచందర్, లక్ష్మణ్‌నాయక్, తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన

మొయినాబాద్: కాంగ్రెస్‌తోనే ప్రజా పాలన సాధ్యమని పార్టీ చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని మేడిపల్లి, మోత్కుపల్లి, చిలుకూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో దొరల పాలన సాగిస్తుంటే.. కాలె యాదయ్య చేవెళ్లలో దోపిడీ రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. కుటుంబ పాలనతో సెటిల్‌మెంట్లు, భూ కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలతో పాటుగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. ఈ నెల 30న ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పురాణం వీరభద్రస్వామి, మల్లేశ్ యాదవ్, ఎంపీటీసీలు మాజీ సభ్యులు గణేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, యాదయ్య, కాంతారావు, నాయకులు మక్బుల్, ప్రేమ్, యశ్వంత్, జొన్నాడ రాజు, ప్రభు, రాజేష్‌గౌడ్, రాజుగౌడ్, మాణిక్యం పాల్గొన్నారు.

మీ బిడ్డను గెలిపించండి


మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి

మీర్‌పేట: 'మహేశ్వరం నా ఇల్లు'.. మీ ఇంటి ఆడబిడ్డనైన నన్ను ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా సోమవారం మీర్‌పేట కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో దాసరి నారాయణరావునగర్, కమలానెహ్రూనగర్, మీర్‌పేట కూడలి వరకు రోడ్‌షో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ 24 గంటల విద్యుత్, నల్లా ద్వారా ఇంటింటికి మంచినీరు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు వంటి ప్రతిష్టాత్మకమైన పథకాలను అమలు చేస్తూ ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ వాళ్లు గతంలో ఈ ప్రాంతంలో వరదలప్పుడు, కరోనా కష్టకాలంలో కనపడలేదన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, కార్పొరేటర్లు అనిల్‌యాదవ్, సిద్దాల బీరప్ప, ధనలక్ష్మి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డికే మా మద్దతు

రెడ్డి సంక్షేమ సంఘం నాయకుడు రాజశేఖర్‌రెడ్డి

యాచారం: ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డికే తాము మద్దతిస్తున్నట్లు తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం కిషన్‌రెడ్డిని రాజశేఖర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సంఘంనాయకులు, కార్యకర్తలు కారు గుర్తుకు ఓటేసి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభు త్వం మూడోసారి అధికారంలోకి వచ్చినవెంటనే రెడ్ల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించేలాకృషి చేస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారని వెల్లడించారు.

ఇంటింటి ప్రచారం

మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాశ్ఛ భాషా ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలిస్తే మంత్రి అవుతాడని,అధికనిధులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శివలీల, మాజీ సర్పంచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రాజశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

కారు గుర్తుకే ఓటేయండి

కారు గుర్తుకు ఓటేసి మంచిరెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అభ్యర్థించారు. చౌదర్‌పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్ఛ భాషా, సర్పంచ్‌నర్సింహారెడ్డి, పార్టీ నాయకులు శ్రీశైలం, జగదీశ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే బీసీలకు న్యాయం

పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

మంచాల: బీజేపీతోనే బీసీలకు న్యాయం చేకూరుతుందని పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని లోయపల్లిలో పార్టీ అభ్యర్థి నోముల దయానంద్‌కు మద్దతుగా రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పనులు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం తామే చేసినట్లు చెప్పుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్,


లోయపల్లిలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, అశోక్ గౌడ్, జంగయ్య గౌడ్, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధి చెప్పాలి

అసదుద్దీన్ ఒవైసీ

పహాడీషరీఫ్: హైదరాబాద్ నగరం పేరు మార్చాలనుకుంటున్న బీజేపీకి సరైన రీతిలో బుద్ధి చెప్పాలని మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఓటర్లకు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ షాహిన్‌నగర్‌లో సోమవారం ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డికి మద్దతుగా జల్సా(సభ)ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు లోలోపల ఒక్కటేనన్నారు. బయటికి మాత్రం శత్రువులుగా చూపించుకునేందుకు పోటీ పడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ ముస్లిం మైనార్టీలకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారన్నారు. మంత్రి సబితారెడ్డి మైనార్టీలు నివాసం ఉంటున్న జల్‌పల్లి మున్సిపాలిటీపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. ఆమెను గెలిపించాలని ప్రజలను కోరారు.


షాహిన్‌నగర్ సభలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

సీపీఎం అభ్యర్థులను అసెంబ్లీకి పంపండి

త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం పార్టీ అభ్యర్థులను అసెంబ్లీకి పంపించాలని, ప్రజల పక్షాన చట్టసభల్లో గళం వినిపిస్తారని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పార్టీ కేంద్ర కార్యవర్గసభ్యుడు మాణిక్ సర్కార్ అభ్యర్థించారు. సోమవారం మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్యను గెలిపించాలని కోరుతూ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్ సర్కార్ మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర ఏళ్ల కేసీఆర్ పాలనలో టీఆర్ఎస్, బీఆర్ఎస్ పార్టీగా మారిందే తప్పా.. ప్రజలకిచ్చిన ఒక్క హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో కాంగ్రెస్ విఫలమైందని తప్పుబట్టారు. ప్రజల పక్షాన పాలకులను సీపీఎం మాత్రమే ప్రశ్నిస్తుందన్నారు. బీఆర్ఎస్ సర్కార్ పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి.. ఆ పార్టీ కార్యకర్తలకే ఇచ్చిందని దుయ్యబట్టారు. కేంద్ర


రోడ్ షోలో ప్రసంగిస్తున్న మాణిక్ సర్కార్

ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులివ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందన్నారు. సుత్తికొడవలి గుర్తుపై ఓటేసి సీపీఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర నాయకులు భూపాల్, జయలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యుడు జగదీశ్, మండల కార్యదర్శి జంగయ్య పాల్గొన్నారు.

పరాయివాళ్లను సాగనంపండి

- ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటేయండి
- ఆశీర్వదిస్తే 60 గజాల ఇంటిస్థలం
- మహేశ్వరం బీఎస్పీ అభ్యర్థి కేఎంఆర్


ఇంటింటి ప్రచారంలో కేఎంఆర్

మహేశ్వరం: చేవెళ్ల చెల్లమ్మ సబితారెడ్డిని, అన్నయ్య కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని వారి సొంత ప్రాంతాలకు పంపి తనను అసెంబ్లీకి పంపాలని బీఎస్పీ మహేశ్వరం అసెంబ్లీ అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన మండల పరిధిలోని మహేశ్వరం, మన్సాన్‌పల్లి, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, దుబ్బచర్ల, సుభాన్‌పూర్, మాణిక్యమ్మగూడ, అమీర్‌పేట్, హర్షగూడ, జెండామ్రి తండా, సిరిగిరిపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కేఎంఆర్ మాట్లాడుతూ.. బడుగుల అభ్యున్నతి బీఎస్పీ నిరంతరం కృషి చేస్తోదన్నారు. తనను గెలిపిస్తే పేదలకు 60 గజాల ఇంటి స్థలం, పేదింటి ఆడపిల్ల వివాహానికి తన సొంత నిధులతో వివాహ సామగ్రి అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లకు రాపిడో ఉచిత సర్వీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 30న జరగనున్న ఎన్నికలకు ఓటర్లను తరలించేందుకు ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించనున్నట్లు రాపిడో సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. నగరంలోని 26 పోలింగ్‌స్టేషన్‌లకు రాపిడో సేవలు లభించనున్నాయి. ఓటర్లు తమ మొబైల్ ఫోన్ రాపిడో యాప్‌లో 'ఓట్ నౌ' కోడ్‌ను నమోదు చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకొనేలా ఈ సర్వీసులను అందుబాటులో ఉంచనున్నట్లు రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి తెలిపారు. రవాణా సదుపాయం లేని కారణంగా ఓటు వేయలేని పరిస్థితి ఉండకూడదని చెప్పారు. గ్రేటర్‌లో గత ఎన్నికల్లో 40 శాతం నుంచి 55 శాతం వరకే ఓటింగ్ నమోదైందని, దీన్ని మరింత పెంచేందుకు తమవంతు కృషిగా రాపిడో సేవలను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేటి సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు బంద్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల వేళ.. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వైన్ షాపులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇప్పటికే పెద్ద ఎత్తున మద్యం పంపిణీ చేయడంతో అనేక చోట్ల దుకాణాలు సైతం ఖాళీ అయ్యాయి. మరోవైపు కొత్తగా లైసెన్సులు పొందిన మద్యం దుకాణాలు ఎన్నికల కోడ్ దృష్ట్యా ఇంకా తెరుచుకోలేదు. దీంతో పాత మద్యం దుకాణాల యజమానులు తమ వద్ద ఉన్న స్టాక్‌ను పెద్ద మొత్తంలో విక్రయిస్తున్నారు. లైసెన్స్ గడువు ముగిసిన దృష్ట్యా కొత్తగా మద్యం నిల్వలను పెంచుకోవడం లేదని ఆబ్కారీశాఖ అధికారులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం నియంత్రణకు చర్యలు చేపట్టినప్పటికీ భారీ ఎత్తున విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. గ్రేటర్‌లోని సుమారు 600కు పైగా ఉన్న మద్యం దుకాణాల్లో సగానికి పైగా ఖాళీ అయినట్లు అంచనా. ఈ నెల 30న ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ నెల 28 మంగళవారం సాయంత్రం 5 నుంచి 30వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసి ఉంచనున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడనున్న డిసెంబర్ 3వ తేదీ కూడా మద్యం షాపులు మూసి ఉంటాయని అధికారులు తెలిపారు.

శ్రీరాముడి సాక్షిగా..


కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పార్టీ చేవెళ్ల నియోజకవర్గ అభ్యర్థి పామెన భీంభరత్ ప్రజల సమక్షంలో అఫిడవిట్ రాసిచ్చారు. సీతారాంపూర్‌లో సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేశారు. - షాబాద్